




ఇఫ్తార్ విందు

బొబ్బిలి పట్టణంలోని జామియా మసీదులో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ముస్లిముల కోసం ఆదివారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. మసీదులో ముస్లిములతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేసి ఇఫ్తార్ విందును స్వీకరించారు. ఇందులో ఎఎంసి చైర్మన్ బి.శ్రీనివాసరావు, ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు. - ప్రజాశక్తి, బొబ్బిలి

శరవేగంగా వైద్య కళాశాల నిర్మాణం

- వచ్చే ఏడాది నుంచి తరగతుల నిర్వహణకు సన్నాహాలు
- అందుబాటులో మరిన్ని వైద్య సేవలు



నిర్మాణ దశలో ఉన్న వైద్య కళాశాల భవనం

మెడికల్ కాలేజీ భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. వచ్చే ఏడాది నుంచే తరగతులు నిర్వహించేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. అండర్ పోస్టు గ్రాడ్యుయేట్ (ఎంబిబిఎస్) తరగతులు ప్రారంభించే దిశగా అడుగులు పడుతున్నాయి. దీంతో, సుమారు రెండు దశాబ్దాలుగా జిల్లా వాసులు ఎంతగానో ఎదురుచూస్తున్న జిల్లావాసుల కల నెరవేరబోతోంది. మరోవైపు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా బోధనా సిబ్బంది కూడా నియమితులయ్యారు. సర్వజన ఆస్పత్రిలో ఇప్పుడిప్పుడే వైద్యారోగ్య సేవలు విస్తరిస్తున్నాయి.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గాజులరేగ రెవెన్యూ పరిధిలో సుమారు 70 ఎకరాలు మెడికల్ కళాశాలకు కేటాయించిన విషయం విదితమే. భవన నిర్మాణ పనులు రాత్రి, పగలూ నిరాటంకంగా సాగుతున్నాయి. నిత్యం రాష్ట్ర స్థాయి అధికారులు, మంత్రులు పర్యవేక్షిస్తుండటంతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. మరోవైపు సర్వజనాసుపత్రి, ఘోషాసుపత్రి కూడా మెడికల్ కాలేజీకి అనుబంధంగానే మారాయి. సుమారు తొమ్మిది నెలల క్రితమే విశాల సముదాయంతో కూడిన ఆసుపత్రి భవనాలను మెడికల్ కాలేజీకి అప్పగించారు. ఇక్కడ పనిచేసిన వైద్య విధాన పరిషత్తు వైద్యులంతా ఆ విభాగంలో నడుస్తున్న ఏరియా ఆస్పత్రులకు, సిహెచ్‌సిలకు బదిలీ అయ్యారు. దాదాపు అదే సంఖ్యకు తగ్గట్టు బోధనా వైద్యులు నియమితులయ్యారు. ఇదే ఆసుపత్రిలో పనిచేస్తున్న సుమారు 250 మంది సిబ్బంది యథాతథ స్థానాల్లో కొనసాగుతున్నారు. మెడికల్ కాలేజీకి అవసరమైన సిబ్బందిని దశలవారీగా భర్తీ చేస్తున్నారు. ప్రస్తుతం అడ్మినిస్ట్రేటివ్ విభాగం కూడా ఆసుపత్రిలో కొనసాగుతోంది. సర్వజన, ఘోషాసుపత్రుల్లో 430 బెడ్లు అందుబాటులో ఉన్నాయి. గతం నుంచి ఉన్న మెడిసిన్, జనరల్ సర్జరీ, పీడియాట్రిక్స్, డెంటల్, ఆర్థో తదితర విభాగాలకు తోడుగా టీచింగ్‌కు తోడ్పడే అటానమీ, ఫియాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రో బయాలజీ (పెథాలజీ), ఫోరెన్సిక్ మెడిసిన్, ఎస్‌పిఎం తదితర అనుబంధ విభాగాలు అందుబాటులోకి రానున్నట్టు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ పద్మలీల చెబుతున్నారు. టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ విభాగాలు కలుపుకుని మెడికల్ కాలేజీలో మొత్తం 22 విభాగాలు ఉన్నాయి. ఇటీవలే ఎనస్తీషియా వైద్య పోస్టులు కూడా భర్తీ అయ్యాయి. ఈనేపథ్యంలో మెడికల్ కాలేజీలో ఒపి, ఐపిల సంఖ్య పెరిగింది. జిల్లా కేంద్రాసుపత్రి మెడికల్ కాలేజీగా మారిన తరువాత ఔట్ పేషెంట్ల సంఖ్య 10శాతం పెరిగింది. గతంలో రోజూ వెయ్యి నుంచి 1100మంది వచ్చేవారు. ప్రస్తుతం 1100 నుంచి 1200 మంది వరకు వస్తున్నారు. ఆ మేరకు ఇన్‌పేషెంట్ల సంఖ్యకూడా పెరుగుతోంది.

కార్డియాలజీ, నెఫ్రాలజీ తదితర సూపర్ స్పెషాలిటీ విభాగాలు మాత్రం ఇంకా అందుబాటులోకి రావాల్సి ఉంది. లేబోరేటరీలో అదనపు సదుపాయాలు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావాలి. కాలేజీలో తరగతులు ప్రారంభమయ్యాక అండర్ పోస్టుగ్రాడ్యుయేట్ తొలి బ్యాచ్ విడుదల కావాలంటే కనీసం ఐదేళ్ల సమయం పడుతుంది. ఆ తరువాతే కాలేజీలో పీజీ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. ఇలా కాలేజీలో పీజీ కోర్సులు అందుబాటులో వచ్చాక మాత్రమే సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని ప్రిన్సిపల్ డాక్టర్ పద్మలీల 'ప్రజాశక్తి'కి తెలిపారు.

ఒప్పందం అమలయ్యేనా?

- పిఎఫ్ సొమ్ము జమచేయని జ్యూట్‌మిల్లు యాజమాన్యం
- పింఛను కోసం కార్మికుల ఎదురుచూపులు



పిఎఫ్ బకాయి కోసం ఆందోళన చేస్తున్న జ్యూట్ కార్మికులు (ఫైల్)

ప్రజాశక్తి-బొబ్బిలి

వైసిపి అధికారంలోకి వస్తే మూతపడిన శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ మిల్లును తెరిపిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని అధికార పార్టీ తుంగలో తొక్కింది. హామీ మేరకు జ్యూట్ మిల్లును తెరిపించే ప్రయత్నం చేయలేదు. చివరికి జ్యూట్‌మిల్లు యాజమాన్యం జ్యూట్‌మిల్లును అమ్మేసింది. ఆ తరుణంలో 2019లో జ్యూట్‌మిల్లు కార్మికులు, యాజమాన్యం మధ్య ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు సమక్షంలో జరిగిన ఒప్పందం సంపూర్ణంగా అమలు చేయడం లేదు. దీంతో జ్యూట్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ కార్మికులకు చెల్లించాల్సిన గ్రాడ్యుటీ, పిఎఫ్ బకాయిలు చెల్లిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చింది. గ్రాడ్యుటి చెల్లించినా, పిఎఫ్ బకాయిలు చెల్లించలేదు. గ్రాడ్యుటి బకాయిలు చెల్లించాలని కార్మికులు ఎన్నో పోరాటాలు చేసిన ఫలితంగా జ్యూట్ యాజమాన్యం స్పందించి అందజేసింది. కానీ పిఎఫ్ బకాయి చెల్లించకుండా ఏళ్లతరబడి జాప్యం చేస్తోంది. పిఎఫ్ బకాయి చెల్లించకపోవడంతో కార్మికులు పింఛను రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పిఎఫ్ బకాయి రూ.1.60 కోట్లు

శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ మిల్లు యాజమాన్యం 760 మంది నూతన పర్మినెంట్, బదిలీ కార్మికులకు పిఎఫ్ బకాయి రూ.1.60 కోట్లు చెల్లించాలి. పిఎఫ్ బకాయి చెల్లించకపోవడంతో 51 ఏళ్లు దాటిన కార్మికులకు పింఛను రావడం లేదు. దీంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. 760 మంది కార్మికులలో 500 మందికి పైగా పింఛనుకు అర్హత సాధించారు. పిఎఫ్ బకాయి యాజమాన్యం చెల్లించకపోవడంతో పింఛను రావడం లేదు. ఒప్పందం ప్రకారం పిఎఫ్ బకాయి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

పింఛను రాక ఇబ్బందులు



పిఎఫ్ పింఛనుకు అర్హత సాధించి రెండేళ్లు కావస్తోంది. పిఎఫ్ బకాయిలను జ్యూట్ యాజమాన్యం చెల్లించకపోవడంతో పిఎఫ్ పింఛను అందడం లేదు. నాకు ఆరోగ్యం సహకరించక, పని లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పిఎఫ్ బకాయి చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

\- పిరిడి రాంబాబు, జ్యూట్ కార్మికుడు, బొబ్బిలి

పిఎఫ్ బకాయి చెల్లించకుంటే పోరాటం



కార్మికుల పిఎఫ్ బకాయి చెల్లించకపోతే పోరాటం చేస్తాం 2019లో పిఎఫ్ బకాయిలు చెల్లించేందుకు ఒప్పందం చేసుకున్నా అమలు చేయడం లేదు. శ్రీలక్ష్మిశ్రీనివాస జ్యూట్‌మిల్లు యాజమాన్యం తీరు వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. బకాయి చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

\- పి.శంకరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

డబ్బులిచ్చి మోసపోయాననే వ్యధతోనే..

ప్రజాశక్తి - పొందూరు/రాజాం



బుడ్డెపు రామకృష్ణ (ఫైల్)

శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం బురిడి కంచరాంలో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విజయనగరం జిల్లా రాజాం మండలం పెనుబాక గ్రామానికి చెందిన బుడ్డెపు రామకృష్ణ (35) శనివారం మృతి చెందాడు. 16 రోజుల పాటు శ్రీకాకుళం రిమ్స్‌లో మృత్యువుతో పోరాడి ఓడిపోయాడు. పోలీసుల కథనం ప్రకారం...

పొందూరు మండలం బురిడికంచరాం గ్రామానికి చెందిన గులివిందల అసిరినాయుడు సైనిక పాఠశాలలో పిల్లలకు సీట్లు ఇప్పిస్తానని నమ్మబలికి రామకృష్ణ నుంచి రూ.16 లక్షలు తీసుకున్నాడు. సైనిక పాఠశాలలో సీటు రాకపోవడంతో మోసపోయానని గ్రహించి తన డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ అసిరినాయుడును కోరాడు. ఎన్నిసార్లు అడిగినా ఇదిగో, అదిగో అంటూ తప్పించుకునేవాడు. దీంతో మృతుడు తన భార్య రజనీతో కలిసి గత నెల 31వ తేదీన అసిరినాయుడు స్వగ్రామం బురిడికంచరాం వెళ్లి అడగగా ' నేను ఇవ్వను ఎవ్వరికి చెప్పుకుంటావో చెప్పుకో' అని అనడంతో తన వెంట తెచ్చుకున్న పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న రామకృష్ణను గ్రామస్తుల సహకారంతో భార్య శ్రీకాకుళంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించింది. మూడు రోజులకే రూ.3.50 లక్షలు ఖర్చు కావడంతో తట్టుకోలేక శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తోంది. శనివారం రాత్రి పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు ఈనెల 1న పోలీసులు కేసు నమోదు చేశారు. రామకృష్ణ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

కేంద్ర ప్రభుత్వ విధానాలను

ప్రజాకళల ద్వారా తిప్పికొట్టాలి

ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



మాట్లాడుతున్న ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్

కేంద్ర ప్రభుత్వం అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజా కళల ద్వారా తిప్పికొట్టాలని ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్‌పిఆర్ భవనంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ అధ్యక్షతన ఆదివారం జరిగిన ప్రజానాట్య మండలి వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. ప్రజాసంపదను కేంద్రం కార్పొరేట్లకు ధారాదత్తం చేసి ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను అంచలంచెలుగా ప్రయివేటుపరం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ తొమ్మిదేళ్ల పాలనలో ఎన్నడూ లేనంతగా కార్పొరేట్ సంస్థల ఆదాయాలు పెరిగి, సామాన్యులు ఇంకా దారిద్ర్యంలోకి నెట్టబడ్డారని వ్యాఖ్యానించారు. ఈ విధానాలకు వ్యతిరేకత రాకుండా మతం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఇటువంటి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజా కళలైన ఆట, పాట, కళారూపాల ద్వారా ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు రమణ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు డి.రాము తదితరులు పాల్గొన్నారు.

పేర్ని నాని క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఔరంగజేబు రెహమతుల్లా అలై గురించి తప్పుగా మాట్లాడిన వైసిపి ఎమ్మెల్యే పేర్ని నాని బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఎపిసిసి మైనార్టీ సెల్ వైస్ చైర్మన్ మహమ్మద్ హుస్సేన్ షరీఫ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా ఆయన ఛాంబర్‌లో మాట్లాడుతూ ఔరంగజేబు గొంతు కోస్తుంటే పేర్ని నాని ఏమైనా చూశారా? అని ప్రశ్నించారు. రాజకీయాల కోసం పదేపదే బిజెపి తరహా ముస్లిముల మనోభావాలతో ఎందుకు ఆడుకుంటున్నారు? నిలదీశారు. ఈసారి టికెట్ వస్తుందో, లేదో అని బాగా నిరాశ, నిస్పృహలోకి వెళ్లిన నాని.. నోటికి ఏది వస్తే అది మాట్లాడుతున్నారని ఎద్దేవాచేశారు.

రాజకీయాలకు అతీతంగా సేవలు

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. నగరంలోని 31వ డివిజన్ పరిధిలోని పద్మావతి నగర్, వసంతవిహార్ ప్రాంతాలలో ఆదివారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల పర్యటించారు. వెంటవెంటనే స్థానికుల సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా వసంత విహార్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, పారిశుధ్యం మెరుగుపరచాలని, ప్రధాన కాలువలో పూడికలు తీసివేయాలని, ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేయాలని కోరారు. కోలగట్ల స్పందిస్తూ సోమవారం సాయంత్రానికల్లా విద్యుత్తు దీపాలు ఏర్పాటు అవుతాయని చెప్పారు. రెండు రోజుల్లో డంపర్ బిన్లను ఏర్పాటు చేస్తామన్నారు. వారం రోజుల్లో ప్రధాన కాలువ పనులు చేపడతామని చెప్పారు. సమీపంలో ఉన్న వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తికాగానే కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ఆ తర్వాత పార్టీలకతీతంగా సేవలు అందించడమే తమన ధ్యేయమని చెప్పారు. ఎనీటైం సర్వీస్ అనే విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎన్ను లక్ష్మణరావు, జోనల్ ఇన్‌ఛార్జి బొద్దాన అప్పారావు, కార్పొరేటర్ గణపతిరావు, బాల బ్రహ్మారెడ్డి, అసోసియేషన్ అధ్యక్షులు శివ, కార్యదర్శి శ్రీరామ్, ప్రజారోగ్య అధికారి డాక్టర్ సత్యనారాయణ, డి ఎ అప్పారావు, ఎఇ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైకి మురుగు నీరు

ఇబ్బంది పడుతున్న పాదచారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్




రోడ్డుపైకి చేరిన మురుగునీరు

నిత్యం వేలాదిమంది రాకపోకలు సాగించే మార్గం.. కలెక్టరేట్- గూడ్స్‌షెడ్ రోడ్డు. అటువంటి రోడ్డులో కాలువ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో మురుగునీరు రోడ్డు మీద నుంచి ప్రవహిస్తోంది. బాలాజిమార్కెట్ వరకు రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మించారు. అక్కడి నుంచి రైల్వే బ్రిడ్జి వరకు కాలువలు ఇరువైపులా లేకపోవడంతో మురుగు నీరు రోడ్డుపైకి చేరుతోంది. దీంతో ఆ రోడ్డు మీదుగా వెళ్లే పాదచారులు, వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసనకు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. అదే రోడ్డులో కార్లలో తిరిగే అధికారులు నడిచివెళ్తే... ప్రజలు పడే ఇబ్బంది తెలుస్తుందని పలువురు చెబుతున్నారు. వెంటనే మురుగునీరు రోడ్డు మీద నుంచి కాకుండా కాలువల ద్వారా వెళ్లే విధంగా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

పంట నష్టపరిహారానికి ప్రతిపాదనలు

- త్వరలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు
- వ్యవసాయ రంగంలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్
- వ్యవసాయ యాంత్రీకణ క్రమంగా పెరుగుతోంది
- 'ప్రజాశక్తి'తో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.టి.రామారావు ముఖాముఖి



గత నెలలో కురిసిన వర్షాలకు మొక్కజొన్న రైతులు నష్టపోయారని, వారికి నష్టపరిహారం విషయమై ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విటి రామారావు తెలిపారు. త్వరలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు జిల్లాలో ఏర్పాటు చేస్తామని, ఈలోపు రైతులంతా రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వైద్యారోగ్య రంగంలో మాదిరిగానే వ్యవసాయ, ఉద్యాన పంటల సాగులోనూ ప్రభుత్వం డయాగ్నోస్టిక్ సెంటర్లను ప్రవేశపెడుతోందని, తద్వారా పంటలకు వచ్చిన తెగుళ్లను ఎప్పటికప్పుడు నివారించేందుకు అవకాశం కలుగుతుందని వివరించారు. జిల్లాలో వ్యవసాయ యాంత్రీకరణ క్రమంగా పెరుగుతోందన్నారు. కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఏటా పెరుగుతుండడమే ఇందుకు నిదర్శనంగా చెప్పకోవచ్చని అన్నారు. 'ప్రజాశక్తి'కి ఈ వారం ముఖాముఖీ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు..

\- ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

ఇటీవల వర్షాలకు ఏయే పంటలకు నష్టం వాటిల్లింది?.

మార్చిలో కురిసిన అకాల వర్షాలకు జిల్లా వ్యాప్తంగా 59,172 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లింది. మొత్తంగా 39,812 మంది రైతులు నష్టపోయారు. ఇతర పంటల్లో పెద్దగా నష్టం జరగలేదు.

రైతులందరికీ నష్టపరిహారం అందుతుందా?.


లేదు! పంటల నష్టపరిహారం కోసం ప్రభుత్వం మార్గదర్శకాలను నిర్దేశించింది. ప్రతి రైతు తన పంటలో కనీసం 33 శాతానికి మించి నష్టం జరిగితేనే ప్రభుత్వ పరిహారం వర్తిస్తుంది. ఈ వివరాలు ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పొందుపర్చాం.

నిబంధనల ప్రకారం ఎంతమందికి పరిహారం అందే అవకాశముంది?.

10 మండలాల్లో 159 మంది రైతులకు 33 శాతానికిపైగా మొక్కజొన్న పంట నష్టం వాటిల్లింది. ఈ విస్తీర్ణం 989 ఎకరాలుగా నమోదైంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వీరందరికీ కలిపి రూ.49.46 లక్షల పరిహారం వచ్చేందుకు అవకాశం ఉంది. ఇప్పటికే ప్రతిపాదనలు పంపాం.

మొక్కజొన్న మద్దతు ధర ఎంత?.

మొక్కజొన్న మద్దతుధర క్వింటా రూ.1962 ఉంది. రైతులు ఇంతకన్నా తక్కువకు విక్రయించాల్సిన అవసరం లేదు. త్వరలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు కూడా ఏర్పాటవు తాయి. వీటికి సంబంధించిన ప్రతిపాదనలు ఇప్పటికే జిల్లా జాయింట్ కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపాం. ఈలోపు రైతులు తమ రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించు కోవాలి. మొక్కజొన్న విషయంలో దళారులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కన్నా తక్కువకు కొనుగోలు చేస్తున్నట్టు మా దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో రైతులను అప్రమత్తం చేస్తున్నాం. తక్కువ ధరకు విక్రయించాల్సిన అవసరం లేదు. రైతులను మోసం చేసినట్టు తేలితే సంబంధిత వ్యాపారులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.



జిల్లాలో వ్యవసాయ యాంత్రీకరణ ఎలా ఉంది?

ప్రతి ఆర్‌బికె పరిధిలోనూ ఐదు నుంచి ఆరుగురు రైతులకు రూ.15 లక్షల విలువగల కస్టమ్ హైరింగ్ సెంటర్లను ప్రభుత్వం మంజూరు చేస్తోంది. ఇందులో 10 శాతం లబ్ధిదారుడి వాటా కాగా, 50 శాతం బ్యాంకు రుణం మంజూరు చేస్తుంది. మిగిలిన 40 శాతం ప్రభుత్వం సబ్సిడీ రూపంలో భరిస్తుంది. వీటిని తీసుకున్న రైతులు వారి సొంత అవసరాలకు ఉపయోగించుకోవడంతోపాటు స్థానికంగా ఉన్న ప్రయివేటు యంత్రాలకు తీసుకుంటున్న అద్దెకన్నా 10శాతం తగ్గింపుతో సేవలు అందించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం.

జిల్లాలో కస్టమ్స్ హైరింగ్ సెంటర్లు ఎన్ని ఉన్నాయి?.

జిల్లాలో 500 ఆర్‌బికెలు ఉండగా ఇప్పటి వరకు 324 ఆర్‌బికెల్లో రైతులు గ్రూపులుగా ఏర్పడి వీటిని తీసుకున్నారు. మిగిలిన 176 ఆర్‌బికెల్లో రైతులను గ్రూపులుగా ఏర్పాటుచేయాలని అధికార యంత్రాంగం భావిస్తోంది. కానీ, వీటిలో 95ఆర్‌బికెల నుంచి మాత్రమే రైతు గ్రూపుల నుంచి దరఖాస్తులు అందాయి. మరోవైపు ట్రాక్టర్లు దాదాపు అన్ని గ్రామాల్లో ఉన్నాయి. ఈ లెక్కన వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ క్రమంగా పెరుగుతోంది.

వ్యవసాయ రంగంలో డయాగ్నోస్టిక్ సెంటర్లు ఎంత వరకు వచ్చాయి?.

ఔను! ఫ్యామిలీ డాక్టర్ తరహాలోనే ప్రభుత్వం వ్యవసాయ, ఉద్యాన పంటల పరిరక్షణకు కూడా ప్లాంట్ డాక్టర్ కాన్సెప్ట్ తీసుకొస్తోంది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా మండలానికో పిహెచ్‌డిసి (ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్) ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించాం.

వీటి వల్ల ఉపయోగాలేంటి?.

వ్యవసాయ, ఉద్యాన పంటలకు వస్తున్న తెగుళ్లపై ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి, వీటి ద్వారా నివారణ చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ డయాగ్నోస్టిక్ సెంటర్లలో వ్యవసాయ, ఉద్యాన పరిశోధనా శాస్త్రవేత్తలు అందుబాటులో ఉంటారు. బయోస్కోప్ తదితర వ్యవసాయ పరిశోధనా పరికరాలు, వ్యవసాయ పరిశోధనా గ్రంథాలు కూడా అందుబాటులో ఉండనున్నాయి.

వీటి ఏర్పాటుకు ప్రాతిపదిక ఏమిటి?.

ప్రత్యేక సదుపాయాలు కలిగిన ఆర్‌బికెను ఎంపిక చేస్తారు. అక్కడ ఎమ్మెస్సీ లేదా బిఎస్సీ అగ్రికల్చర్ విద్యార్హత ఉంటే సరేసరి. లేదంటే అదే మండలం లేదా ఇతర మండలాల్లో సచివాలయాల్లో పనిచేస్తున్న వారిని బదిలీపై ఈ కేంద్రాలకు తరలిస్తారు. ఇప్పటికే దాదాపు అన్ని జిల్లాల్లోనూ అర్హత గల ఉద్యోగుల ఎంపిక పూర్తయింది. త్వరలో శిక్షణ కార్యక్రమాలు కూడా మొదలవుతాయి.

ఒలింపియాడ్‌కు వాసుదేవ్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



జెడ్‌పి చైర్మన్ నుంచి బహుమతి అందుకుంటున్న వాసుదేవ్

ఎంతో ప్రతిష్టాత్మకమైన ఒలింపియాడ్‌లో ఒకటైన ఐఎన్‌టిఎస్‌ఒ (ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చి ఒలింయాడ్)కు నగరంలోని శ్రీచైతన్య స్కూల్ విద్యార్థి సైలాడ వాసుదేవ్ నాయుడు ఎంపికయ్యాడు. ఈ టాలెంట్ టెస్ట్‌ను 3వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఏటా నిర్వహిస్తారు. దత్తిరాజేరు మండలం పాచలవలస గ్రామానికి చెందిన వాసుదేవనాయుడు (8వ తరగతి) అందులో సత్తాచాటాడు. వాసుదేవ్‌తోపాటు ఎంపికైన విద్యార్థులను శ్రీచైతన్య స్కూల్ యాజమాన్యం అభినందించింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

అభయాంజనేయ స్వామి వార్షికోత్సవ వేడుకల్లో ఉపముఖ్యమంత్రి



మొక్కులు తీర్చుకుంటున్న డిప్యూటీ సిఎం

వేపాడ : మండలంలోని వావిలిపాడు పంచాయతీ పరిధిలో గల సంజీవ మెట్ట వద్ద శ్రీ ఆంజనేయ స్వామి 13వ వార్షికోత్సవ సందర్భంగా స్వామివారిని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆదివారం దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ వేచలపు వెంకట చిన్న రామ నాయుడు, ఎంపిపి డి.సత్యవతమ్మ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు వితరణ


శృంగవరపుకోట: మండలంలోని సంత గౌరమ్మపేట గ్రామంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడి బంగారు నాయుడు ఆధ్వర్యంలో ఆర్థిక సహాయంతో పాటు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన ఐదు కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ తరఫున అండగా ఉంటామని చెప్పారు. ప్రభుత్వ పరంగా సాయ మందించాలని అధికారులను కోరుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపివైసి జనరల్ సెక్రటరీ పూడి శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయుకులు అచ్చిబాబు, పార్టీ యువ నాయకులు వి.గోపి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో ప్రమాదాలకు దూరం

శృంగవరపుకోట : ముందస్తు చిన్న చిన్న జాగ్రత్తలతో పెద్ద పెద్ద అగ్ని ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చునని శృంగవరపుకోట అగ్నిమాపక దళ కేంద్రం అధికారి షేక్ మదీనా తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ జాతీయ అగ్నిమాపక వారోత్సవాలులో భాగంగా ఆదివారం పట్టణంలోని రైల్వే కాలనీలో స్థానికులకు గ్యాస్ ప్రమాదాలు, గ్యాస్ లీకేజీ సంభవించునపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ పద్ధతులు గురించి అగ్నిమాపక సిబ్బంది వివరించారు. అనంతరం పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక అగ్నిమాపక కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ

కొత్తవలస : మండలంలోని తుమ్మికాపల్లి వినాయక్ నగర్‌లో రంజాన్ వేడుకలలో భాగంగా ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాధ హరి కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు నిత్యవసరాలు, వస్త్రాలు పంపిణీ చేశారు. షేక్ జిలాని దంపతుల ఆర్థిక సహాయంతో 36 మంది ఒంటరి వృద్ధులకు12 రకాల నిత్యావసర సరుకులు, వస్త్రాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ రంజాన్ వేడుకలలో ఇటువంటి సేవా కార్యక్రమం చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో ట్రస్టుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సంతోష్ కుమార్, జామధ్ ఇస్లామీ హింద్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సయ్యద్, హమీద్ సన్స్ నిజాముద్దీన్, షేక్ సలీం, రైల్వే రిటైర్డ్ ఎంప్లాయ్ రమణ, మిద్ది అప్పారావు, లీగల్ అడ్వైజర్ కృష్ణ, ట్రస్ట్ ట్రెజరర్ శ్రావణ్ కుమార్, గోవిందరావు, ఈశ్వరరావు, నగేష్, సాయి, గణేష్, రవి తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజల సంతోషమే లక్ష్యం : ఎమ్మెల్యే

కొత్తవలస : ప్రతి కుటుంబం సంతోషంగా ఉండటమే వైసిపి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నరు. ఆదివారం కొత్తవలస గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు నేరుగా పేద ప్రజలకు అందుతున్నాయన్నారు. మరోసారి తనను, సిఎం జగన్మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, పిఎసిఎస్ చైర్మన్ గొరపల్లి శివ, జెసిఎస్ మండల ఇంచార్జ్ బొంతల వెంకటరావు, పంచాయతీ సర్పంచ్ మచ్చా ఎర్రయ్య రామస్వామి, గొరపల్లి రవి, వార్డు సభ్యులు పుసర్ల రఘు, సోషల్ మీడియా ప్రతినిధులు కర్రీ దేవుడు బాబు, అడిగర్ల సంతోష్ పాల్గొన్నారు.



పల్లె నిద్రలో భోజనం చేస్తున్న నాగార్జున, తదితరులు

'అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా'

గరివిడి : 2024 ఎన్నికల్లో చీపురుపల్లి అసెంబ్లీ నియోజవర్గం నుంచి ప్రజలు అవకాశం ఇస్తే నిరంతర అందుబాటులో ఉండి అభివృద్ధి చేసి చూపిస్తానని నియోజకవర్గం టిడిపి ఇంచార్జి కిమిడి నాగార్జున అన్నారు. చీపురుపల్లి మండలంలోని మెట్టపల్లి గ్రామంలో ఆయన శనివారం రాత్రి పల్లె నిద్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రజలతో మాట్లాడారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లెంక సన్యాసి రావు ఇంటి వద్ద రాత్రి భోజనం చేశారు. ఆదివారం ఉదయం గ్రామంలో పర్యటించి రామ మందిరం వద్ద ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటిపడిందన్నారు. రైతాంగానికి సేవలు అందిస్తున్న చీపురుపల్లి ఆర్‌ఇసిఎస్‌ను విలీనం చేయడం దారుణమన్నారు. విలీనం ఆపడంలో మంత్రి బొత్స సత్యనారాయణ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రౌతు కాము నాయుడు, దన్నాన రామ చంద్రుడు, బుటు శ్రీను, ముల్లు రమణ, దన్నాన సూరప నాయుడు, మీసాల నవీన్, శనపతి శ్రీను, రౌతు నారాయణ రావుపాల్గొన్నారు.

నవయుగ వైతాళికుడు వీరేశలింగం

ప్రజాశక్తి - జామి

మహోన్నత వ్యక్తి ఆంధ్ర సమాజాన్ని సరికొత్త సంస్కరణల బాటపట్టించిన నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు సేవలు మరువలేనివని మహిళా స్ఫూర్తి జిల్లా అధ్యక్షురాలు ఆశ్ర శిరీష అన్నారు. మండలంలోని అట్టాడ బిఎస్ఆర్ ఆశ్రమంలో ఆదివారం కందుకూరి వీరేశలింగం పంతులు 175వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా వీరేశలింగం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆశ్ర శిరీష మాట్లాడుతూ బాల్య వివాహాలు రద్దు కోసం వీరేశలింగం నిర్వహించిన ఉద్యమం తెలుగు జాతి మర్చిపోలేనిదని, దేశంలో మొట్టమొదట వితంతు వివాహం జరిపిన ఘనత కూడా వీరేశలింగందేనని, దేశ చరిత్రలో యువజన సంఘం ఏర్పాటు చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. బ్రిటిష్ హయాంలో ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ మరోవైపు సంస్కరణల కోసం ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చారని, నవల, ఉపన్యాసాలు వంటి ప్రక్రియకు ఆద్యులని, తెలుగులో వచ్చిన రాజశేఖర చరిత్ర నవల 1878లో వీరేశలింగం పంతులు రాసినదేనని గుర్తు చేశారు. ఆశ్రమం నిర్వాహకులు ఆశా మహాలక్ష్మి మాట్లాడుతూ చదువుకునే రోజుల్లో వీరేశలింగం పంతులు తెలుగు, సంస్కృతం, ఇంగ్లీష్ భాషల్లో అద్భుత ప్రతిభ కనపర్చారని 130కి పైగా గ్రంథాలు రాశారని, సాంఘిక దురాచారాలను గట్టిగా ఎండగట్టిన గొప్ప మనిషి అని చెప్పారు. తెలుగు జాతి గర్వించదగ్గ మంచి యుగకర్త వీరేశలింగమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాల భార్గవి, ఆశ్రమ నిర్వాహకులు భీశెట్టి బాల వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బాడంగి: వీరేశలింగం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

బాడంగి : సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు 175వ జయంతి సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడకల్లో పింద్రంగి వలస ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై. రవిబాబు మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం పంతులు గొప్ప సంస్కర్తని కొనియాడారు. ఆ కాలంలో మహిళలకు జరుగుతున్న అన్యాయాలను ఎదిరించి మహిళలకు పురుషులతో సమానంగా చదువుకొనే స్వేచ్ఛ కల్పించడమే కాకుండా అప్పటి మూఢాచారం అయిన బాల్య వివాహాల వల్ల తమ భర్తలను కోల్పోయిన మహిళలకు మళ్ళీ వారికి కొత్త జీవితాలు వచ్చే విధంగా విశేషమైన కృషి చేశారు. గ్రంథాలయాధికారి దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పుడు మహిళలు అందరూ స్వేచ్ఛగా అన్ని రంగాలలో ముందుకు సాగుతున్నారంటే అది ఆయన చలవేనన్నారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.



జామి: వీరేశలింగం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆశ్రమ నిర్వాహకులు

ఉత్తమ రైతులకు సన్మానం

ప్రజాశక్తి - జామి

మండలంలోని భార్గవి హెల్ప్ లైన్ అధ్యక్షులు కంది శ్రావణ్ భార్గవ్ ఆధ్వర్యంలో బలరాంపురంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ న్యాయ సలదారు యేరోతు పరుశురాం చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ చిట్టి రమణారావు చేతుల మీదుగా ముగ్గురు ఉత్తమ రైతులను సన్మానించారు. ఈ సందర్భగు జిల్లా పోలీస్ న్యాయ సలహాదారు వై.పరుశురాం మాట్లాడుచు వెంకటరమణ అనే రైతు అటు ఉద్యోగులకు చేవచేస్తూ ఇటు సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా ఉండడం గొప్ప విషయమన్నారు. చిట్టి రమణారావు మాట్లాడుతూ దేశానికి వెన్నుముఖగా, ప్రజలకు ఆహార గింజలను అందిస్తున్న రైతులను తన చేతుల మీదుగా సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఈ ఏడాది నుండి తనకున్న 20 ఎకరాలలో వ్యవసాయం చేయాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. భార్గవ్ హెల్ప్ లైన్ వ్యవస్థాపకులు కంది వెంకటరమణ మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయం చేయడం మాని పోలాలను బీడులుగా మారుస్తున్న నేటి పరిస్థితులలో తమకున్న వ్యవసాయంతోపాటు మరికొంత కౌలుకు తీసుకొని వ్యవసాయమే ఆధారంగా భావించి పంటలను పండిస్తూ, వ్యవసాయ కూలీలకు ఆసరాగా నిలుస్తూ, సామాజిక కార్యక్రమాల ఎడల ఆశక్తి చూపించే యువ రైతులు గులిపిల్లి ఎర్నాయుడు, కంది రాము, గ్రెడ్డి శ్రీనివాసరావులను భార్గవ్ హెల్ప్ లైన్ పక్షాన సత్కరించటం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో బలరాంపురం, కాలనీ వాసులు ఉపాధ్యాయులు ఆర్.విజయాభాస్కర్, పి. సతీష్, పడాల రమణ, చంద్రకుమారి, దేవి, భార్గవ్ హెల్ప్ లైన్ అభిమానులు జూరెడ్డి శ్రీనివాసరావులి (రైల్వే కబడి కోచ్), గార ఈశ్వరరావులి (పోలీస్), భార్గవ్ హెల్ప్ లైన్ సభ్యులు గార పెంటయ్య, కంది సురేష్, గజ్జి సత్యనారాయణ, కురమాన వెంకటరమణ, పొట్నూరు శ్రీనివాసరావు, గుణశేఖర్, కాళ్ళ కృష్ణారావు, పెద్ద సంఖ్యలో మహిళలు, యువత పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న చిట్టి రమణారావు

నాపై బురద జల్లడం తగదు: వైస్ ఎంపిపి



రేగిడి: మండలంలోని 39 గ్రామ పంచాయతీలతో పాటు మండల అభివృద్ధికి కృషి చేసినందుకు తనపై కొంత మంది కావాలనే బురద జల్లుతున్నారని వైస్ ఎంపిపి టంకాల అచ్చెం నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం చిన్న శిర్లాం గ్రామంలో తన నివాసంలో ప్రజాశక్తితో మాట్లాడారు. వైసిపిలో మొదటి నుంచి కార్యకర్తగా ఉంటూ ఎన్నో పదవులు అలంకరించానని అన్నారు. రాజకీయాల్లో ఉంటూ నీతి నిజాయితీగా పనిచేస్తూ తన ఆస్తిని పోగొట్టుకున్నానని గుర్తు చేశారు. మండల అభివృద్ధికి కృషి చేస్తున్న తనకు కార్యకర్తల నుంచి తనకు పేరు వస్తుందని సభ్యులు కాని కొంత మంది ఓర్వలేక ఇటువంటి దుశ్చర్యకు పాల్పడినట్లు వెల్లడించారు. తనపై నిందలు వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఎదుట తనపై తప్పుడు ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. ముఖ్యంగా సభ్యులు కానివారు సమావేశాలకు రావవడం ఒకతప్పైతే, తనపై అనవసరంగా బురదజల్లడం మరోతప్పన్నారు. వాస్తవానికి మండల కమిటీ అన్నదే లేదన్నారు. ఇప్పుడు దీనిపై ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మండల కమిటీ ఏర్పాటు చేస్తే తద్వారా మండల అభివృద్ధి జరిగే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. మండల పరిషత్ మరమ్మతులకు చెట్లు అడ్డు రావడంతో వాటిని తీసివేశామని చెట్లు తొలగించడానికే సొమ్ము చాలకపోవడంతో తన సొంత నిధులు పెట్టినట్లు ఆయన వెల్లడించారు. మండల పరిషత్ కార్యాలయం ఎన్నో ఏళ్ల నుంచి శిధిలా వ్యవస్థలో ఉందని అందరి ఆమోదం తోనే మరమ్మతులకు నిధులు కేటాయించామని చెప్పారు. మరమ్మతు పనులకు అడ్డంగా ఉన్న ఐదు చెట్లను తొలగించి వాటి స్థానంలో మొక్కలు నాటుతున్నా మన్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ చొరవ తీసుకొని అనవసరంగా తనపై బురదజల్లిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

'జగనన్నే మా భవిష్యత్తు'కు స్పందన : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- బొబ్బిలి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు చేపట్టిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేషమైన స్పందన లభిస్తోందని స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలో గల 20వ వార్డులో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ప్రతీ ఇంటికి వెళ్ళి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇంటి యజమానుల అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ గోడ స్టిక్కర్లు అతికించారు. ప్రతి వార్డులోనూ కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకొని 20 తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ చోడగంజి రమేష్ నాయుడు, వార్డు ఇంచార్జ్ సుంకరపల్లి వాసంతి, పట్టణ జెసిఎస్ కన్వీనర్ రేజేటి ఈశ్వరరావు, వైసిపి నాయకులు తెంటు సత్యం నాయుడు, సుంకరపల్లి వెంగళరావు, పూడి చిన్న, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు, వాలంటీర్లు పాల్గొన్నారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

ఆకులపేటలో జగనన్నే మా భవిష్యత్తు

డెంకాడ : మండలంలోని జొన్నాడ పంచాయతీ పరిధిలోని ఆకులపేటలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఆదివారం ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. మరోసారి సిఎం జగన్మోహన్‌రెడ్డిని ప్రతి ఒక్కరూ ఆశీర్వాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జొన్నాడ సర్పంచ్ కోటి నాయుడు, సువ్వాడ రమేష్, సచివాలయం కన్వీనర్లు, గృహసారధులు, వాలంటీర్లు, వార్డ్ మెంబర్లు, నాయకులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సుకు ఆహ్వానం

లక్కవరపుకోట : సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల, రైటర్స్ అండ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విశాఖపట్నం వేదికగా ఈనెల17,18లో జరగనున్న జాతీయ సదస్సుకు మండలంలోని కిత్తన్నపేట గ్రామానికి చెందిన యువ రచయిత గౌరినాయుడును ఆహ్వానించినట్లు ఆదివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సు యువత సమగ్ర అభివృద్ధి, విద్య, సాహితీ సంస్కృతుల పాత్ర అనే అంశంపై జరగనున్నట్లు వివరించారు. తెలుగు సాహిత్యం, వ్యక్తిత్వ వికాసం పాత్రపై చర్చించనున్నట్లు తెలిపారు.

రోడ్డు విస్తరణ పూర్తి చేయాలి

బొబ్బిలి : పట్టణంలోని బలిజిపేట రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని పిసిసి సభ్యులు ముద్వల శ్రీనివాసరావు, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు డిమాండ్ చేశారు. రైతు సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనులు పూర్తి కాకపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని, బజారు రోడ్డు, పూల్ బాగ్ రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

కోచింగ్ పేరుతో ఫీజుల బాదుడు

బొబ్బిలి : కోచింగ్ పేరుతో ఫీజులు బాదేస్తున్నారని ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రవేశ పరీక్షలు శిక్షణ పేరుతో జిల్లా వ్యాప్తంగా అనేక కోచింగ్ సెంటర్లు వెలిశాయన్నారు. మూడు నుంచి ఆరు వారాలు శిక్షణ ఇచ్చేందుకు కాలేజీలు ఫీజు కంటే ఎక్కువ ఫీజు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. అనేక సెంటర్లకు ప్రభుత్వాలు అనుమతులు లేవనీ, అయినా హాస్టల్, బోధన రుసుములు అత్యధికంగా వసూలు చేస్తున్నారన్నారు.

ప్రవేశ పరీక్షకు 251 మంది

లక్కవరపుకోట : మండలంలోని జమ్మాదేవిపేట గ్రామ సమీపంలో ఉన్న జ్యోతిరావుపూలే బాలికల ఆశ్రమ పాఠశాలలో ఐదవ తరగతి ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు ఆదివారం 251 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ పాత్రో తెలిపారు. 280 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా 251 మంది హాజరైనట్లు వివరించారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి- డెంకాడ

మండల కేంద్రంలోని శ్రీసత్య స్మార్ట్ స్కూల్లో శనివారం రాత్రి ఘనంగా వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు పలు సంస్కృతిక కార్యక్రమాలను చేపట్టారు. ఇందులో భాగంగా పిల్లలు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి పాఠశాల చైర్‌పర్సన్ రొంగలి సత్యవతి, ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్, పిఎసిఎస్ చైర్మన్ రొంగలి కనక సింహాచలం చేతుల మీదుగా బహుమతులను, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ పాఠశాలలో చదువుతూ ఆల్ ఇండియా సైన్స్ పాఠశాలకు ఎంపికైన విద్యార్థిని తల్లిదండ్రులను పాఠశాల తరపున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రొంగలి కనకసింహాచలం మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. పిల్లలు మరింత రాణించి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పతివాడ గౌరీ, పాఠశాల ప్రిన్సిపల్ రొంగలి అరుణ్ కుమారి, ఉపాధ్యాయుడు రొంగలి చంద్రశేఖర్ రావు, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న చిన్నారులు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న రొంగలి

నేరాలు ఘోరాలు

ఆటో బోల్తా.. బాలిక మృతి

రామభద్రపురం: స్థానిక శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ పట్నాన లక్ష్మణ తన సోదరుని పిల్లలను సెలవు రోజైనా ఆదివారం తన ఆటోలో షికారుకు తీసుకు రాగా ఆటో అదుపు తప్పిన ప్రమాదంలో సోదరుని బిడ్డ పట్నాన అఖిల (8) ఆటో కింద పడి మృతి చెందింది. ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో సరదాగా పిల్లలను ఆటోలో షికారుకు తీసుకు వస్తున్న సమయంలో బుసాయవలస రహదారి పక్కన ఉన్న చర్చ్ సమీపంలో ఆటో తిప్పేందుకు ప్రయత్నించగా ఒక్కసారిగా ఆటో అదుపుతప్పి పక్కకు పడిపోయింది. ఆటోలో ఉన్న అఖిల ఒక్కసారిగా ఆటో నుంచి తుల్లి పడి ఆటో కిందకు వెళ్లి పోవడం, అదే సమయంలో ఆటో పాప మీద పడటంతో గాయాలు పాలైంది. చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గం మద్యలో పాప మృతి చెందింది. మృతురాలి తండ్రి శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ప్రమాదంలో మృతి చెందిన అఖిల

దొంగల దాడిలో మహిళ మృతి

కొత్తవలస : దొంగల దాడిలో గాయపడి చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక కుమ్మర వీధిలో నివాసముంటున్న మడబోట్టిన సూర్యకాంతంను శనివారం మధ్యా హ్నం ఒంటిగంట ప్రాంతంలో ఒంటరిగా ఇంట్లో ఉండడాన్ని గమనించిన దుండగడు ఇంట్లో ప్రవేశించి, ఆమె కళ్ళల్లో కారం చెల్లి, బలమైన ఆయుధంతో తలపై కొట్టి గాయపరిచాడు. ఆమె మెడలో ఉన్న రెండు తులాల పుస్తెలతాడు, చెవులకు ఉన్న మూడు గ్రాముల ఎత్తు గొలుసులు తెంపుకొని వెళ్లిపోయాడు. ఆమె తలకు బలమైన గాయం కావడంతో కుప్ప కూలిపోయింది. కాసేపటికి వచ్చిన కుమారుడు తల్లి అపస్మారక స్థితి ఉండడాన్ని గమనించి స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో కెజిహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. కొత్తవలస సిఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛంద రక్తదాన శిబిరం

నెల్లిమర్ల : నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపు పేటలో ఆదివారం సాధన యువజన సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పి. నారాయణ రావు, మహరాజా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల జి. శిరీష, ఎంఇఒ పోలుబోతు రామారావు ముఖ్య అతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో వక్తలు మాట్లాడుతూ రక్త దానం ప్రాణ దానం వంటిదని రక్త దానానికి యువత ముందుకు రావాలని కోరారు. యువజన సంఘాలు సమాజం హితం కోరి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. రక్తదానంపై ఉన్న అపోహాలను వీడే విధంగా కళాశాలల్లో కూడా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. శిబిరంలో 32మంది యువకులు స్వచ్ఛందంగా రక్త దానం చేశారు. అనంతరం 15మంది ఎన్‌జిఒలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు కడలి ప్రకాశ రావు, బొడ్డే పల్లి రామకృష్ణారావు, సాధన యువజన సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోలుబోతు దుర్గా ప్రసాద్, పసుమర్తి వెంకట రమణ, ఉపాధ్యక్షులు బెల్లాన వెంకట్రావు, సభ్యులు తుమ్ము అశోక్, పల్ల శ్రీహరి, నల్లి ఉమా తదితరులు పాల్గొన్నారు.



రక్తదాతలను సత్కరిస్తున్న ఎస్ఐ, తదితరులు

గిరిజనుల గోడు పట్టదా?

మెంటాడ: డిప్యూటీ సీఎం గారు! ఆంధ్ర, లోతు గెడ్డ గిరిజనులు గోడు మీకు పట్టదా? అని లోతు గెడ్డ గిరిజన సంఘం నాయకులు వంతు రాంబాబు, కౌలు రైతుల సంఘం జిల్లా నాయకులు రాకోటి రాములు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఉపముఖ్యమంత్రి తోపాటు గిరిజన శాఖ మాత్యులుగా పనిచేసిన తమకు ఎంతో అనుభవం ఉన్న ఎందుకు గిరిజనుల సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. ఐదవ షెడ్యూల్ ఏరియాలో గిరిజన గ్రామాలను చేర్చాలని, ఎస్‌టి ఏరియా ధ్రువపత్రాల అందించాలని, ఆంధ్ర ప్రాజెక్టులో చేప పిల్లల విడుదల చేయాలని, ఆంధ్ర ప్రాజెక్టులో భూములు కోల్పోయిన గిరిజనులకు సొసైటీ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. గిరిజనులకు ఉపాధి కల్పించాలని, డిమాండ్ చేశారు